AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
www.aksharatoday.in


## డ్రాపవుట్స్‌ను గుర్తించాలి



**అక్షరటుడే, ఇందూరు:** జిల్లాలో చదువు మానేసిన విద్యార్థులను గుర్తించి విద్యను అందించాలని అడిషనల్ కలెక్టర్ అంకిత్ అన్నారు. తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ స్టేట్ కో-ఆర్డినేటర్ క్రాంతి రెడ్డి గురువారం జిల్లాకు వచ్చారు. ఈ నేపథ్యంలో అదనపు కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. బడి మానేసి చెడు వ్యసనాలకు లోనుకాకుండా అర్హతలను బట్టి పదో తరగతి ఇంటర్‌లో అడ్మిషన్లు కల్పించాలన్నారు. సమాజంలో మంచి పౌరులుగా తీర్చిదిద్దడానికి మంచి అవకాశమన్నారు. అలాగే జిల్లాకు అందించిన లక్ష్యాన్ని పూర్తి చేయాలని సూచించారు.





## శ్రీరాంసాగర్ వరద గేట్ల మూసివేత

**అక్షరటుడే, బాల్కొండ:** తెలంగాణ వరప్రదాయని శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి వరద తగ్గుముఖం పట్టడంతో గేట్లను మూసివేశారు. ప్రస్తుతం ప్రాజెక్టులోకి 29,545 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. బుధవారం రాత్రి 8 వరద గేట్లను ఎత్తి దిగువకు నీటిని వదిలిన అధికారులు గురువారం ఉదయం వరద గేట్లను మూసివేశారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1091 అడుగులు (80.501 టీఎంసీలు) కాగా ప్రస్తుతం ప్రాజెక్టులో 1091 అడుగుల (80.501టీఎంసీలు) మేర నీరు నిల్వ ఉందని ప్రాజెక్ట్ ఏఈఈ కొత్త రవి తెలిపారు.



## సైబర్ నేరాల నివారణకు అవగాహనే ఆయుధం

**అక్షరటుడే, కామారెడ్డి:** సైబర్ నేరాల నివారణకు అవగాహనే ప్రధాన ఆయుధమని జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర అన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో గురువారం సైబర్ క్రైమ్ నియంత్రణపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా పరిధిలో విధులు నిర్వహిస్తున్న సైబర్ వారియర్స్‌కు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో, హైదరాబాద్ అందించిన టీషర్ట్స్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ.. నేటి డిజిటల్ యుగంలో సైబర్ నేరాలు వేగంగా పెరుగుతున్నాయన్నారు. ప్రతి పోలీస్ సిబ్బంది ఈ రంగంలో పూర్తి అవగాహన కలిగి ఉండడం అత్యంత అవసరమన్నారు. సైబర్ నేరాలను అరికట్టేందుకు సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. ప్రతి కేసును సీరియస్‌గా తీసుకుని బాధితులకు త్వరితగతిన న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు.

## పొలాల్లో ఇసుక మేటలను తొలగించాలి

**అక్షరటుడే, భీమ్‌గల్ :** భారీ వర్షాల వల్ల ఇసుక మేటలు వేసిన భూముల్లో ఉపాధి హామీ కూలీలతో తొలగింపజేయాలని ఎంపీడీవో సంతోష్ కుమార్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడారు. మండలంలో చేపట్టాల్సిన పనుల గురించి మండల వ్యవసాయ అధికారి లావణ్య, ఉపాధిహామీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. మండలంలో 124 మంది రైతుల భూముల్లో సుమారు 85 ఎకరాల్లో ఇసుక మేటలు వేశాయని వ్యవసాయ అధికారులు నివేదిక ఇచ్చారన్నారు. ఉపాధి హామీ పథకంలో వెంటనే అంచనాలు తయారు చేసి పనులు ప్రారంభించాలని తెలిపారు. వ్యవసాయ అధికారులు, ఉపాధిహామీ సిబ్బంది ఉమ్మడి సర్వే చేసి వాస్తవ స్థితిగతులను నివేదిక ఇవ్వాలన్నారు. సమావేశంలో ఉపాధి హామీ ఏపీవో నర్సయ్య, ఇంజినీరింగ్ కన్సల్టెంట్ పూర్ణచంద్, ఉపాధి హామీ సాంకేతిక సహాయకులు తదితరులు పాల్గొన్నారు.

**ఉమ్మడి నిజామాబాద్ జిల్లాపై ఏసీబీ అధికారులు దృష్టి సారించారు. ప్రజల నుంచి పెద్దఎత్తున ఏసీబీకి ఫిర్యాదులు అందుతున్నట్లు తెలుస్తోంది. దీంతో ఇటీవల అధికారులు జిల్లాపై స్పెషల్ ఫోకస్ పెట్టారు. లంచం తీసుకుంటున్న అధికారులను పట్టుకోవడంతో పాటు పలు చోట్ల తనిఖీలు సైతం నిర్వహించారు. అయితే ఏసీబీ దాడులు చేపడుతున్నా.. లంచాలకు మరిగిన అధికారులు మాత్రం మారడం లేదు.**

– అక్షరటుడే, కామారెడ్డి



# ఉమ్మడి జిల్లాపై ఏసీబీ ఫోకస్

▸ ఈ ఏడాదిలో పదికి పైగా కేసులు నమోదు ▸ దాడులు చేపడుతున్నా మారని అధికారులు

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో కొందరు ప్రభుత్వ అధికారుల తీరు ప్రభుత్వానికి, వారు పని చేస్తున్న ఆ శాఖలకు చెడ్డ పేరు తెస్తోంది. ప్రతి పనికి డబ్బులు ఇవ్వాలంటూ ప్రజలను వేధిస్తున్నారు. దీంతో ప్రజలు ఏసీబీ అధికారులను కలిసి తమ గోడును వెళ్లబోసుకుంటున్నారు. ఈ క్రమంలో ఏసీబీ రంగంలోకి దిగుతూ అధికారుల తీరుపై నిఘా వేయడంతో పాటు, అవినీతి అధికారులపై కొరడా ఝుళిపిస్తోంది.

### లైట్ తీసుకుంటున్న అధికారులు

ఏసీబీ దాడులు జరుగుతున్నా అధికారుల్లో మార్పు రావడం లేదు. లంచాలకు అలవాటు పడిన అధికారులు పద్ధతులు మార్చుకోవడం లేదు. కిందిస్థాయి అటెండర్ నుంచి మొదలుకుని జిల్లా అధికారి వరకు ఇదే ఒరవడి కొనసాగిస్తున్నారు. ఏసీబీ దాడులను సీరియస్‌గా తీసుకోవడం లేదనే చర్చ నడుస్తోంది. దాడులు జరిగినా అవినీతి ద్వారా సంపాదించిన డబ్బుతో పైరవీలు చేసి త్వరగా ఉద్యోగం పొందే ఆలోచనతో అధికారులు ఉన్నట్టుగా సమాచారం.

### 8 నెలల్లో అనేక దాడులు

ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు ఉమ్మడి జిల్లాలో ఏసీబీ అధికారులు అనేక దాడులు చేశారు. ప్రజల నుంచి ఫిర్యాదు రావడంతో నేరుగా రంగంలోకి దిగుతున్నారు. అంతేగాకుండా ప్రజల్లో సైతం ఏసీబీ అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. లంచాలు ఇవ్వొద్దని, డబ్బులు అడిగితే తమకు ఫిర్యాదు చేయాలని సూచిస్తున్నారు. ఈ మేరకు బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, ప్రధాన కూడళ్లలో ఏసీబీ అధికారులు పోస్టర్లు సైతం అతికించారు.

### ఏసీబీ దాడుల వివరాలు

- ఓ కేసులో నిందితునిగా చేర్చకుండా ఉండేందుకు రూ.12,500 లంచం తీసుకుంటుండా లింగంపేట ఎస్సై సుధాకర్‌ను ఏసీబీ అధికారులు జనవరి 29న పట్టుకున్నారు.
- ఓపెన్ ప్లాట్ రిజిస్ట్రేషన్ కోసం రూ.10 వేలు లంచం తీసుకుంటూ నిజామాబాద్ సబ్ రిజిస్ట్రార్ శ్రీరామరాజు మార్చి 3న ఏసీబీకి దొరికారు.
- నిజామాబాద్ రవాణా శాఖ కార్యాలయంలో మార్చి 12 న ఏసీబీ దాడులు చేసింది. ఏజెంట్ ఎండీ ఖలీల్ రూ.27 వేలతో పట్టుబడ్డాడు.
- ఎఫ్‌టీవో నిధుల బదిలీ కోసం రూ.7 వేలు తీసుకుంటూ ఆర్మూర్ పంచాయతీరాజ్ శాఖ సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్ శర్మ ఏప్రిల్ 21న దొరికాడు.
- ఇసుక ట్రాక్టర్ల విడుదల కోసం డబ్బులు డిమాండ్ చేశారనే ఆరోపణలతో మే 14న బిచ్కుంద పోలీస్ స్టేషన్‌లో ఏసీబీ అధికారులు సోదాలు చేశారు.
- ఓపెన్ ప్లాట్ అసెస్‌మెంట్ కోసం రూ.18 వేలు డిమాండ్ చేసిన మాక్లూరు మండలం గొట్టిముక్కల కార్యదర్శి గంగామోహన్ మే 21న ఏసీబీ అరెస్ట్ చేసింది.
- ఓ కేసులో నిందితులను నిర్దోషులుగా విడుదల చేయించేందుకు లంచం తీసుకుంటూ కామారెడ్డి జిల్లా కోర్టు అసిస్టెంట్ పీపీ అశోక్ శివరాం, కానిస్టేబుల్ సంజయ్ మే 23న దొరికారు.
- మద్నూర్ మండలంలోని సలాబత్‌పూర్ చెక్‌పోస్టులో జూన్ 26న ఏసీబీ అధికారులు సోదాలు చేపట్టారు. కామారెడ్డి సమీపంలోని పొందుర్తి చెక్‌పోస్టుపై జులై 16న దాడులు చేపట్టారు. రూ.52 వేలు సీజ్ చేశారు. అసిస్టెంట్ ఎంవీఐ రిచర్డ్ సన్‌పై అధికారులకు నివేదిక అందించారు.
- లైసెన్స్ పునరుద్ధరణ కోసం రూ.25 వేలు లంచం తీసుకుంటూ ఆర్మూర్ ఎంవీఐ వివేకానంద రెడ్డి ఆగస్ట్ 21న దొరికారు.
- వీఎల్‌టీ నంబర్ కేటాయించడం కోసం రూ.7 వేలు తీసుకుంటూ సెప్టెంబర్ 3న నిజామాబాద్ కార్పొరేషన్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌రావు ఏసీబీకి దొరికాడు.







## ఇందిరమ్మ ఇళ్లను వేగంగా పూర్తిచేయాలి

**అక్షరటుడే, బాన్సువాడ:** ఇందిరమ్మ ఇళ్లను వేగంగా పూర్తి చేసుకోవాలని గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ విజయపాల్ రెడ్డి లబ్ధిదారులకు సూచించారు. బాన్సువాడ మండలంలోని గురువారం కోనాపూర్, సంగోజీపేట గ్రామాల్లో పర్యటించి వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్న ఇళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులకు నిర్మాణ ప్రక్రియపై పూర్తి అవగాహన కల్పించారు. నిర్మాణదశలో ఉన్న స్టేజీ ఫొటోలను ఎలా అప్‌లోడ్ చేయాలో వివరించారు. లబ్ధిదారులు తమ వివరాలను ఇందిరమ్మ వెబ్‌సైట్‌లో పరిశీలించుకోవచ్చని చెప్పారు. ఏవైనా సమస్యలు తలెత్తితే ప్రభుత్వ టోల్‌ఫ్రీ 1800 599 5991కు సంప్రదించాల్సిందిగా సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (హౌసింగ్) గోపాల్, అసిస్టెంట్ ఇంజినీర్ వినీత్, సంబంధిత పంచాయతీ కార్యదర్శులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.



## చెరువు బాగు కోసం రైతులంతా ఏకమయ్యారు..

**అక్షరటుడే, ఎల్లారెడ్డి :** ఎవరో వస్తారని ఏదో చేస్తారని ఎదురు చూడకుండా గ్రామస్థులు తమ చెరువును బాగు చేసుకునేందుకు స్వచ్ఛందంగా ముందుకొచ్చారు. చెరువు నీరు వృథాకాకుండా కాపాడుకునేందుకు సిద్ధమయ్యారు. ఇటీవల కురిసిన భారీవర్షాలకు వరద ఉధృతికి తిమ్మాపూర్ చెరువు కట్ట, పంట కాల్వలు, మత్తడి కొట్టుకుపోయింది. ఆ గ్రామ శివారులోని పంటలకు ఆధారమైన చెరువు ధ్వంసం కావడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయమై అధికారులు, నాయకులకు విన్నవించినా ఫలితం లేకపోయింది. దీంతో గ్రామస్థులే నడుం బిగించారు. ప్రతి ఇంటి నుంచి ఒకరు వచ్చి శ్రమదానంతో కట్టకు ఏర్పడిన బుంగను పూడ్చేందుకు శ్రమించారు. జేసీబీని ఏర్పాటు చేసి కాల్వల మరమ్మతులు.. చెరువు బుంగ పూడిక పనులు చేపట్టారు.



## టౌన్ ప్లానింగ్ పనితీరుపై కలెక్టర్ సమీక్ష

**అక్షరటుడే, ఇందూరు:** నిజామాబాద్ నగరపాలక సంస్థ పట్టణ ప్రణాళిక విభాగం పనితీరుపై కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి గురువారం కార్పొరేషన్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. నూతన భవన నిర్మాణాలకు అనుమతులు, క్రమబద్ధీకరణ, అక్రమ కట్టడాలపై చేపట్టిన చర్యలు తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. సంబంధిత ఫైళ్లను తనిఖీ చేసి పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ఎల్ఆర్ఎస్ రుసుము చెల్లించిన వారికి త్వరగా క్రమబద్ధీకరణ ప్రొసీడింగ్స్ అందించాలన్నారు. సమావేశంలో నగరపాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, అదనపు కమిషనర్ రవిబాబు, టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు పాల్గొన్నారు. మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో ఇటీవల ఏసీబీ దాడులు జరిగాయి. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఒకరు రూ.7వేలు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా దొరికారు. దీంతో కార్పొరేషన్ కార్యాలయంలో అవినీతిపై సర్వత్రా చర్చ జరిగింది. దీంతో కలెక్టర్ సమీక్ష నిర్వహించినట్లుగా తెలుస్తోంది.

## బాధితులకు తక్షణమే నష్టపరిహారం అందించాలి

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** వరదలు సంభవించి రెండువారాలు గడిచినప్పటికీ అధికారులు, ప్రజాప్రతినిధుల నుంచి ఎలాంటి స్పందన లేదని మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తాడ్వాయి మండల సంతాయిపేట్‌లో భారీ వరదలకు కొట్టుకుపోయిన పంట పొలాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించారు. తక్షణమే పంట నష్టపోయిన రైతులకు ఎకరాలకు రూ.లక్ష పరిహారం అందజేయాలని డిమాండ్ చేశారు. ఎంగ్రియల్ గ్రామంలో భారీ వర్షాలకు దెబ్బతిన్న పత్తి, సోయాబీన్, మొక్కజొన్న పంటలను పరిశీలించారు. సంతాయిపేట్, చిట్యాల, ఎంగ్రియాల్ గ్రామాల్లో వరద బీభత్సానికి వందల ఎకరాల్లో ఇసుక మేటలు వేసిందని.. రాళ్లు మట్టి పేరుకుపోయాయన్నారు. కానీ ప్రజాప్రతినిధుల నుంచి స్పందన లేకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి విపత్తు వల్ల నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.లక్ష సహాయం అందించాలని డిమాండ్ చేశారు. అనంతరం దేమే గ్రామంలో గతంలో తన వద్ద పనిచేసిన గన్‌మన్ నవీన్ తండ్రి ఇటీవల మృతిచెందగా వారి ఇంటికి వెళ్లి పరామర్శించారు. అదేవిధంగా ఆ గ్రామ బీఆర్ఎస్ మాజీ సర్పంచ్ సంగారావు నానమ్మ మృతి చెందగా వారి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.





## బీసీ రిజర్వేషన్లపై బీజేపీవి తప్పుదోవ పట్టించే మాటలు..

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** బీసీ రిజర్వేషన్‌పై తలతిక్క మాటలతో బీజేపీ నాయకులు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని రాష్ట్ర సహకార యూనియన్ ఛైర్మన్ మానాల మోహన్ రెడ్డి విమర్శించారు. పార్టీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికలకు ముందు కామారెడ్డి డిక్లరేషన్‌లో భాగంగా బీసీలకు 42శాతం రిజర్వేషన్ ఇస్తామని ఇచ్చిన మాటమీద కాంగ్రెస్ కట్టుబడి ఉందన్నారు. బీసీలకు రిజర్వేషన్లు కల్పించాకే.. సర్పంచ్ ఎన్నికలకు వెళ్లాలని నిర్ణయించుకున్నామన్నారు. కానీ కేంద్ర ప్రభుత్వం రిజర్వేషన్లకు మోకాలడ్డు పెట్టడం సరికాదని స్పష్టం చేశారు. అసెంబ్లీ లోపల బీజేపీ ఎమ్మెల్యేలు బీసీ బిల్లును స్వాగతిస్తున్నామని చెబుతున్నారని.. అదే పార్టీ ఎంపీలు మాత్రం బీసీ బిల్లు నుంచి మైనారిటీలను తీసేస్తేనే బిల్లుకు ఆమోదం తెలుపుతామని చెప్పడం బీజేపీ ద్వంద్వ వైఖరికి నిదర్శనమని మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ ఛైర్మన్ అంతరెడ్డి రాజారెడ్డి, రాష్ట్ర ఎన్ఎస్‌యుఐ ప్రధాన కార్యదర్శి వేణు రాజ్, జిల్లా ఓబీసీ అధ్యక్షుడు నరేందర్ గౌడ్, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు సంతోష్, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు యాదగిరి పాల్గొన్నారు.



## మైనార్టీ పాఠశాల తనిఖీ చేసిన ఆర్డీవో

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** పట్టణంలోని తెలంగాణ మైనారిటీ గురుకుల పాఠశాలను ఆర్డీవో పార్థసింహారెడ్డి గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న వసతులు, కిచెన్ రూం, స్టోర్ రూం, పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని సూచించారు. పాఠశాల పరిసరాలు శుభ్రంగా ఉంచాలన్నారు. అలాగే పాఠశాలలో విద్యార్థులకోసం ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని పరిశీలించారు. డివిజన్‌లోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో వైద్య శిబిరాలు నిర్వహించి, విద్యార్థులు సీజనల్ వ్యాధుల బారిన పడకుం డా చూడాలన్నారు. ఆయన వెంట డివిజన్ సామాజిక ఆరోగ్య అధికారి జి ఠాగూర్, సబ్ యూనిట్ అధికారి పాశం గోవిందరెడ్డి, మండల ఆరోగ్య పర్యవేక్షకుడు జనార్దన్ రెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్ రాణి, ఎంఎల్‌హెచ్‌పీ సంతోష్ ఉన్నారు.

## మత్తు పదార్థాలను నియంత్రించాలి



**అక్షరటుడే, బోధన్:** యువత భవిష్యత్తును నాశనం చేస్తున్న డ్రగ్స్, గంజాయి, ఇతర మత్తు పదార్థాలను నియంత్రించాలని పీవోడబ్ల్యూ బోధన్ పట్టణ అధ్యక్షురాలు బి నాగమణి డిమాండ్ చేశారు. పట్టణంలోని ఎక్సైజ్ కార్యాలయం వద్ద గురువారం ధర్నా చేపట్టారు. అనంతరం ఎక్సైజ్ సీఐకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇటీవల హైదరాబాద్‌లోని చర్లపల్లిలో మహారాష్ట్ర నుంచి వచ్చిన క్రైం పోలీసులు రూ.12 వేల కోట్ల విలువైన డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నారన్నారు. మహారాష్ట్రలో తయారు చేసి హైదరాబాద్‌తో పాటు రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకు సరఫరా చేసి విక్రయిస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వం, పోలీసులు మరింత నిఘా పెంచి మత్తు పదార్థాల నిర్మూలనకు కృషి చేయాలని కోరారు. డ్రగ్స్ మాఫియాకు కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మహిళా సంఘం జిల్లా నాయకురాలు బీ పాషా బేగం, పట్టణ నాయకురాలు శాంతాబాయి, లక్ష్మి, నాగమణి, సువర్ణ, లత, గంగామణి, సుజాత, సునంద, తదితరులు పాల్గొన్నారు.

## లైబ్రరీని పరిశీలించిన గ్రంథాలయ సంస్థ ఛైర్మన్



**అక్షరటుడే, బాన్సువాడ:** జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ అంతిరెడ్డి రాజారెడ్డి గురువారం మోస్రా గ్రంథాలయాన్ని పరిశీలించారు. గ్రామ అభివృద్ధి కమిటీ నిర్మించిన నూతన భవనంలోకి గ్రంథాలయాన్ని మార్చాలని గ్రామస్థుల కోరిక మేరకు అంగీకరించి త్వరలోనే మార్చుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో కొత్మీర్‌కర్ లక్ష్మణ్, షేక్ ఇంతియాజ్, సాయిలు, నర్సారెడ్డి, పోతిరెడ్డి, రాజశేఖర్ రెడ్డి, సతీష్ రెడ్డి, చింటూ తదితరులు పాల్గొన్నారు.

## దేవునిపల్లిలో ఉచిత వైద్య శిబిరం



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** ఎల్లారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని దేవన్‌పల్లి గ్రామంలో మత్తమాల పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. వైద్యులు శరత్ కుమార్ ఆధ్వర్యంలో రోగులకు చికిత్సలు నిర్వహించారు. ఇటీవల కురుస్తున్న వర్షాలతో విషజ్వరాలు, మలేరియా, వైరల్ ఫీవర్ వంటి వ్యాధులు విస్తరించే అవకాశం ఉందని జాగ్రత్తలు పాటించాలని ఆయన ప్రజలకు సూచించారు. ప్రజలు తాగునీటిని మరిగించి సేవించాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. వైరల్ ఫీవర్ ఉన్న వారిని గుర్తించి రక్త పరీక్షలు చేశారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్, గ్రామస్థులు పాల్గొన్నారు.





### వసతులు కరువై..

# రోగుల అవస్థలు

▸ బాన్సువాడ మాతా శిశు ఆస్పత్రిలో తప్పని ఇబ్బందులు

**బాన్సువాడలోని మాతా శిశు ఆస్పత్రిలో సమస్యలతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రతిరోజూ వందల సంఖ్యలో గర్భిణులు, శిశువులు, మహిళలు చికిత్స నిమిత్తం ఆస్పత్రికి వస్తుంటారు. అయితే, ఆస్పత్రిలో సరైన వసతులు లేక రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా పడకలు (బెడ్లు) సరిపోక సమస్యగా మారింది. - అక్షరటుడే, బాన్సువాడ**

ఆస్పత్రిలో బెడ్లు తక్కువగా ఉండడంతో ఒక్కో బెడ్‌పై ఇద్దరు, ముగ్గురు రోగులు చికిత్స పొందే పరిస్థితి నెలకొంది. బెడ్ దొరకని వారు గదుల బయట, వరండాలో వైద్యం పొందుతున్నారు. దీంతో ఇన్ఫెక్షన్లు, అంటు వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉంది. ముఖ్యంగా గర్భిణీలు, పుట్టిన శిశువులకు ఇది మరింత ప్రమాదకరం. శుభ్రత, తాగునీరు, మరుగుదొడ్ల వంటి మౌలిక వసతులు సరిపోకపోవడంతో రోగులు మరింత ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు.

### బెడ్ దొరకడం లేదు..



మా బాబు టైఫాయిడ్ జ్వరంతో బాధపడుతున్నాడు. చికిత్స నిమిత్తం మాతా శిశు ఆస్పత్రికి తీసుకువచ్చాను. కానీ, బెడ్ దొరకపోవడంతో సోమవారం రాత్రి ఇంటికి తీసుకెళ్లి ఉదయం మళ్లీ ఆస్పత్రికి తీసుకువచ్చాను.

– సంపత్, బాన్సువాడ

### వాంతులు, జ్వరంతో ..



మా ఇద్దరు పిల్లలు జ్వరంతో వాంతులు చేసుకోవడంతో మంగళవారం ఉదయం మూడు గంటలకు చికిత్స నిమిత్తం మాతా శిశు ఆస్పత్రికి తీసుకువచ్చాను. ఒక్క బెడ్ దొరకలేదు. తీవ్ర ఇబ్బందులకు గురయ్యాం. ఆస్పత్రిలో మెరుగైన సౌకర్యాలు కల్పించాలి.

– దత్తు, బాన్సువాడ

## బాల్ బ్యాడ్మింటన్ కోచింగ్ క్యాంప్ ప్రారంభం



**అక్షరటుడే, ఇందల్వాయి:** ఇందల్వాయి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉమ్మడి నిజామాబాద్ జిల్లా సబ్ జూనియర్ బాలుర బాల్ బ్యాడ్మింటన్ కోచింగ్ క్యాంప్ ప్రారంభమైంది. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మోత్కూరి నవీన్ గౌడ్ గురువారం శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ శిక్షణలో విద్యార్థులు మెళకువలు నేర్చుకొని క్రీడల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం వెంకటరామిరెడ్డి, సీనియర్ ఉపాధ్యాయులు లక్ష్మీనాథం, ఫిజికల్ డైరెక్టర్ భూపతి రాజేశ్వర్, ఉపాధ్యాయులు గోపి, శ్యాంరావు, గ్రామ యువకులు శేఖర్, సత్యనారాయణ, చంద్రప్రకాష్, క్రీడాకారులు పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

## అక్రమ నిర్మాణంపై చర్యలు తీసుకోవాలి



**అక్షరటుడే, భీమ్‌గల్:** నివాసాల మధ్య అనుమతి లేకుండా ప్రార్థనా స్థలాన్ని నిర్మించి తమ మనోభావాలను దెబ్బతీస్తున్న వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని మాల సంఘం సభ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ప్రార్థనా స్థలం ప్రతినిధిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నాకు దిగారు. తహశీల్దార్ షబ్బీర్, మున్సిపల్ కమిషనర్ గంగాధర్, ఎస్సై సందీప్ వచ్చి కాలనీ వాసులతో మాట్లాడి సముదాయించారు. కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.



## రోజువారి జీవితంలో యోగా ఎంతో అవసరం

**అక్షరటుడే, ఇందూరు:** రోజువారి జీవితంలో యోగా ఎంతో అవసరమని శిక్షకురాలు డాక్టర్ ఐశ్వర్య అన్నారు. జేసీఐ వారోత్సవాల్లో భాగంగా బుధవారం యోగా శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. యోగా శరీరాన్ని బలపరచడమే కాకుండా.. మనసును పదునుగా మారుస్తుందన్నారు. ఆరోగ్యాన్ని కాపాడుకోవడంలో యోగాసనాలు ముఖ్య పాత్ర పోషిస్తాయన్నారు. రోజుకు కనీసం 30 నుంచి 45 నిమిషాలు యోగాకు కేటాయించాలన్నారు. కార్యక్రమంలో జేసీఐ ఇందూరు అధ్యక్షుడు గౌతమి తదితరులు పాల్గొన్నారు.

## మెంట్రాజ్‌పల్లి జెడ్పీహెచ్‌ఎస్‌లో వైద్యశిబిరం

**అక్షరటుడే, ఇందూరు:** డిచ్‌పల్లి మండలం మెంట్రాజ్‌పల్లి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో గురువారం ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. శీనునాయక్ డెంటల్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో విద్యార్థులకు ఉచితంగా దంతవైద్య పరీక్షలు చేశారు. అనంతరం వారికి టూత్‌పేస్ట్‌లు, బ్రష్‌లు అందజేశారు. ఈ సందర్భంగా దంతవైద్యులు మాట్లాడుతూ.. విద్యార్థులు దంతాల పట్ల నిర్లక్ష్యం వహించవద్దన్నారు. ఎలాంటి సమస్యలున్నా వెంటనే దంతవైద్యుడని సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో శీనునాయక్ డెంటల్ ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



## మంజీరలో గుర్తుతెలియని మృతదేహం లభ్యం

**అక్షరటుడే, బాన్సువాడ:** బాన్సువాడ – పిట్లం రహదారిపై మంజీర నది వంతెన వద్ద గురువారం తెల్లవారుజామున గుర్తుతెలియని మృతదేహం కలకలం రేపింది. పిట్లంవైపు వెళ్తున్న ప్రయాణికులు దీనిని గమనించి వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని వివరాలు సేకరిస్తున్నారు. మృతుడి వివరాలు, మరణానికి గల కారణాలు ఇంకా తెలియరాలేదు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

## డ్రంకన్ డ్రైవ్‌లో ఒకరికి 10 రోజుల జైలు

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** మద్యం తాగి వాహనం నడిపిన కేసులో ఒకరికి పది రోజుల జైలు శిక్ష విధించినట్లు ట్రాఫిక్ సీఐ ప్రసాద్ తెలిపారు. ట్రాఫిక్ ఏసీపీ మస్తాన్ అలీ ఆదేశాల మేరకు ఇటీవల వాహన తనిఖీలు చేపట్టగా.. 16 మంది డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడ్డారు. ఈ మేరకు గురువారం వారికి కౌన్సెలింగ్ నిర్వహించి, కోర్టులో హాజరు పర్చగా, వీరిలో బోర్గాం(పి)కి చెందిన చామకూర లక్పతి ఇదివరకే పలుమార్లు డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడ్డాడు. దీంతో అతనికి పదిరోజుల జైలు, మరో 15 మందికి రూ.21,500 జరిమానా విధించారు.



## సంగోజీపేటలో ఆరోగ్యశిబిరం

**అక్షరటుడే, బాన్సువాడ:** మండలంలోని సంగోజీపేట గ్రామంలో శుక్రవారం ఆరోగ్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు ఇమ్రాన్ రోగులకు పరీక్షించారు. రోగులకు అవసరమైన మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఈవో రవి, సబ్ యూనిట్ ఆఫీసర్ సుధాకర్, ఎంఎల్‌హెచ్‌పీ మానస, ఆరోగ్య కార్యకర్తలు సునీత, మంజుల, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎల్లారెడ్డి బీజేపీ కార్యశాల

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో గురువారం కార్యశాల నిర్వహించారు. పార్టీ రాష్ట్ర శాఖ ఆదేశాల మేరకు సెప్టెంబర్ 17 విమోచన దినోత్సవం, ప్రధాని మోదీ జన్మదినం సందర్భంగా స్వచ్ఛభారత్, బూత్ స్థాయిలో మొక్కలు పెంపకం, రక్తదాన శిబిరం ఏర్పాటుపై చర్చించారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు మర్రి, బాలకిషన్, పట్టణ అధ్యక్షుడు దివిటీ రాజేష్, ప్రధాన కార్యదర్శి కుచులకంటి శంకర్, శ్రీను, మహిళా మోర్చ అధ్యక్షురాలు సుజాత, మాజీ ఎంపీపీ నక్క గంగాధర్, సీనియర్ నాయకులు రాములు, కుచులకంటి సతీష్, సాయిలు, ఉపాధ్యక్షులు వంగపల్లి కాశీనాథ్, అల్లం పండరి, పోచయ్య, కార్యదర్శులు మామిడి రమేష్, శివ, యువ నాయకులు జంగం శివ, తదితరులు పాల్గొన్నారు.



## సీనియర్ జర్నలిస్ట్ నారాయణ మృతి




**అక్షరటుడే, డిచ్‌పల్లి:** సీనియర్ జర్నలిస్ట్ నారాయణ మృతి చెందాడు. ఆంధ్రజ్యోతి డిచ్‌పల్లి రిపోర్టర్‌గా పని చేస్తున్న ఆయన గురువారం ఉదయం మిట్టాపల్లిలో గుండెపోటుతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. జిల్లాలోని జర్నలిస్ట్‌లు ఆయన మృతికి సంతాపం తెలిపారు.



## సార్వజనిక్ దుర్గామాత నూతన కమిటీ ఎన్నిక

**అక్షరటుడే, కోటగిరి :** మండల కేంద్రంలో సార్వజనిక్ దుర్గామాత ఉత్సవ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. శ్రీ విఠలేశ్వర ఆలయంలో గ్రామస్థులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈనెల 22వ తేదీ నుంచి ప్రారంభం కానున్న దుర్గామాత నవరాత్రుల కార్యక్రమాలపై చర్చించారు. ప్రతి ఏడాది కూడా దుర్గామాత ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలని నిర్ణయించారు. కమిటీ సభ్యుల ఏకాభిప్రాయంతో నూతన కమిటీ ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎస్.సాయి బాబా గౌడ్, ఉపాధ్యక్షుడిగా గోక శంకర్, నిరాడి భూమయ్య, మేత్రి భూమయ్య, ప్రధాన కార్యదర్శి మహేష్ రెడ్డి, కోశాధికారి సుధాకర్, సహ కోశాధికారి శ్రీకాంత్, సహాయ కార్యదర్శి సాయి గణేశ్, వడ్ల విఠల్‌ను ఎన్నుకున్నామన్నారు.



## ఆలయంలో సుందరకాండ పారాయణం

**అక్షరటుడే, కోటగిరి :** మండలంలోని లింగాపూర్ అడికేష్ లింగమయ్య ఆలయంలో గురువారం సుందరకాండ పారాయణం నిర్వహించారు. ఆధ్యాత్మిక గురువు బ్రహ్మశ్రీ నోరి నారాయణ మూర్తి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా భక్తులు మాట్లాడుతూ.. సుందరకాండ పారాయణం వినడాన్ని పూర్వజన్మ సుకృతంగా భావించామన్నారు. భగవంతుని కృపను పొందేందుకు అవకాశం లభించిందన్నారు. ఆలయ పునర్నిర్మాణ దాత, ఆలయ కమిటీ ఛైర్మన్ ముమ్మలనేని రాజశేఖర్ సతీసమేతంగా కార్యక్రమంలో పాల్గొని భగవంతుని ఆశీస్సులు పొందారు.



## అంత్యక్రియలకు ఆర్థికసాయం

**అక్షరటుడే,కోటగిరి:** పోతంగల్ మండల కేంద్రంలోని పాత పోతంగల్‌లో కొంతల నాగయ్య అనే వ్యక్తి అనారోగ్యంతో మృతి చెందాడు. అయితే వారిది పేద కుటుంబం కావడంతో అంత్యక్రియలకు కూడా ఇబ్బంది ఏర్పడగా గ్రామస్థుడు గంట్ల రాజు సామాజికవేత్త డాక్టర్ సితాలే రమేశ్‌కు సమాచారం అందించాడు. వెంటనే స్పందించిన రమేష్ ఆర్థిక సాయాన్ని సేకరించారు. ఈ మేరకు గురువారం రూ.13,500 బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్థులు మేకల పీరాజీ, మేదరి దశరథ్, విశ్వనాథ్, గంట్ల రాజు, సాయిలు, నాగేషం, వీరు, కొంతల పిరాజీ, యువకులు, తదితరులు పాల్గొన్నారు.